
సాక్షి బాపట్ల

గురువారం । 9 । ఫిబ్రవరి । 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద 2,423 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 1343 క్యూసెక్కులు విడుదలయ్యాయి.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 41.0997 టీఎంసీలు. ఎగువ నుంచి 8,533 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. దిగువకు 4,200 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా బుధవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

నేడు మంత్రి రోజా బాపట్ల రాక

బాపట్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా గురువారం బాపట్ల రానున్నారు. ఉదయం 9 గంటలకు రోడ్డు మార్గంలో విజయవాడ నుంచి బయలుదేరి 10.30 గంటలకు సూర్యలంక సముద్ర తీరానికి చేరుకుంటారు. సూర్యలంక సముద్రతీరాన్ని పరిశీలించి మధ్యాహ్నం 2 గంటలకు తిరిగి బయలుదేరి విజయవాడకు చేరుకుంటారు. పర్యాటక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా జిల్లాకు వస్తుండటంతో అధికారులు ఏర్పాట్ల పనుల్లో నిమగ్నమయ్యారు.


ఆరుగురు ట్రెజరీ ఉద్యోగులకు చార్జ్ మెమోలు

గుంటూరు వెస్ట్: ఆరుగురు జిల్లా ట్రెజరీ శాఖ ఉద్యోగులకు రాష్ట్ర శాఖ చార్జ్ మెమోలు జారీ చేసింది. 2014–15 అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో 74 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జిల్లా ట్రెజరీ కార్యాలయం అదనపు చెల్లింపులు చేసింది. దీంతో అప్పట్లో కొంత గందరగోళమేర్పడింది. కొందరు ఉన్నతాధికారులు ఈ విషయమై వాస్తవాలను గుర్తించి అప్పట్లోనే చర్యలు చేపట్టినా అవి పూర్తిస్థాయిలో అమలు కాలేదు. దీనిపై మళ్లీ జిల్లా ట్రెజరీ అధికారులు దృష్టి సారించారు.

11న జాతీయ లోక్‌అదాలత్

నరసరావుపేటటౌన్: మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఓ.వెంకట నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. అదాలత్‌లో రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులతో పాటు సివిల్ కేసులు, ముందస్తు వ్యాజ్యాలు పరిష్కరించబడతాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకుని విలువైన సమయాన్ని వృథా కాకుండా కాపాడుకోవాలన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 561.90 అడుగుల వద్ద ఉంది. ఇది 236.6166 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 10,120, ఎడమ కాలువకు 8,629, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 20,224, ఎస్‌ఎల్‌బీసీకి 2,400, వరద కాలువకు 320 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 41,693 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 20,795 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 836.00 అడుగుల వద్ద ఉంది. ఇది 57.0878 టీఎంసీలకు సమానం.

యార్డులో 1,15,904 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 1,10,553 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,15,904 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ.21,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ.25,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.12,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 76,868 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3,000, గరిష్ట ధర రూ.4,300, మోడల్ ధర రూ.3,600 వరకు పలికింది.

కలత వద్దు.. కొరత లేదు

రబీ పంటలకు తగినన్ని ఎరువులు

- రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా
- రబీలో 2.94 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు
- మొక్కజొన్న, శనగ, జొన్న, వరి సాగు
- రబీ కోసం 1,05,742 మెట్రిక్ టన్నుల ఎరువులు
- ఇప్పటికే 77,602 మెట్రిక్ టన్నులు పంపిణీ
- ఎరువుల కొరత లేదంటున్న జేడీఏ అబ్దుల్ సత్తార్



పంపిణీకి సిద్ధంగా ఉన్న ఎరువులను పరిశీలిస్తున్న జేడీఏ అబ్దుల్ సత్తార్

సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లాలో రబీ సీజన్‌కు ఎరువుల కొరత లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులను జిల్లా వ్యాప్తంగా సిద్ధంగా ఉంచి ఎప్పటికప్పుడు పంపిణీ చేస్తోంది. అత్యధికంగా అన్నదాతలు వినియోగిస్తున్న యూరియాను ఎప్పటికప్పుడు జిల్లాకు తరలించి రైతులకు అందిస్తోంది. శాస్త్రవేత్తల సూచనలకు భిన్నంగా కొందరు రైతులు జొన్న, మొక్కజొన్న పంటలకు ఎకరాకు 4 బస్తాలకు బదులుగా 8 బస్తాలు వేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు భవిష్యత్‌లో ఎరువుల కొరత ఉంటుందేమోనని ఊహించి కొందరు ముందస్తుగానే ఎరువులు కొనిపెట్టుకుంటున్నారు. దీనివల్ల ఎరువులకు డిమాండ్ ఏర్పడినట్లు ప్రధానంగా యూరియాకు అధికంగా డిమాండ్ నెలకొన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

రైతులకు ఇబ్బంది కలుగకుండా సరఫరా

జిల్లా వ్యవసాయ శాఖ రైతులకు ఇబ్బందులు కలుగకుండా అవసరమైన మేరకు యూరియాను దిగుమతి చేసుకొని ఆర్బీకేలు, సొసైటీలు, ప్రైవేట్ దుకాణాల ద్వారా అందజేస్తోంది.

జిల్లాలో ఎరువుల పంపిణీ ఇలా..

జిల్లాలో అక్టోబర్ నెల నాటికి 40,807 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. జనవరి నెలలో 64,934 మెట్రిక్ టన్నుల ఎరువులను జిల్లాకు కేటాయించారు. దీంతో 1,05,742 మెట్రిక్ టన్నులు ఉండగా ఇప్పటి వరకు రబీలో 77,602 మెట్రిక్ టన్నులు రైతులకు పంపిణీ చేశారు. ఇంకా 28,140 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. యూరియా 6 వేల మెట్రిక్ టన్నులు సిద్ధంగా ఉండగా శనివారం నాటికి మరో రెండు వేల మెట్రిక్ టన్నులు రానుంది. ఫిబ్రవరి చివరి నాటికి మరో 6 వేల టన్నుల యూరియా జిల్లాకు చేరుకుంటుంది. ఈ రబీలో రైతులకు ప్రభుత్వం యూరియాతో పాటు డీఏపీ, ఎంఓపీ, కాంప్లెక్స్, ఎస్‌ఎస్‌పీ, కంపోస్ట్ ఎరువులను సరఫరా చేసింది.

జిల్లాలో రబీ సాగు

జిల్లాలో రబీ సాధారణ సాగు విస్తీర్ణం 3,70,790 ఎకరాలు కాగా ప్రస్తుత సీజన్‌లో 2,94,270 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ప్రధానంగా మొక్కజొన్న 85,993 ఎకరాలు, శనగ 64,772, వరి 29,653, పెసర 26,447, పొగాకు 16,895, జొన్న 14,489 ఎకరాలు, వేరుశనగ 9,719 ఎకరాల్లో సాగు చేశారు. వీటితో పాటు వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు.

యూరియా కొరత లేదు



జిల్లాలో అన్నిరకాల ఎరువులతో పాటు యూరియా కొరత లేదు. రైతులకు అవసరమైన మేరకు యూరియాను ప్రభుత్వం అందిస్తోంది. యూరియా ఎంత అవసరమైనా రైతులకు కొరత లేకుండా అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– షేక్ అబ్దుల్ సత్తార్, జిల్లా వ్యవసాయాధికారి

కుమార్తెను చంపి తల్లి ఆత్మహత్య





తల్లీకుమార్తెల మృతదేహాలు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని కుంచనపల్లిలో వివాహిత తన నెలల కుమార్తెను చంపి, అనంతరం ఆమె ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. అమరావతి మండలం వైకుంఠపురానికి చెందిన రమ్యకు కుంచనపల్లికి చెందిన శేఖర్‌తో ఏడాది క్రితం వివాహమైంది. ఈ దంపతులకు ఏడు నెలల పాప ఉంది. ఈ క్రమంలో ఇంట్లో వారందరూ బయటకు వెళ్లిన సమయంలో రమ్య (21) తన కుమార్తె విద్యశ్రీ (ఏడు నెలలు)ను చంపి, అనంతరం ఆమె ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరివేసుకుని మృతి చెందింది. ఈ ఘటనపై తాడేపల్లి సీఐ శేషగిరిరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటి వరకు మృతురాలు రమ్య బంధువులు మృతికి గల కారణాలపై ఎలాంటి వివరాలు పోలీసులకు చెప్పలేదు. రమ్య తల్లి, మేనత్త ఇదే తరహాలో ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు.

పర్యాటక రంగం అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే కోన రఘుపతి



వాచ్ టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి, ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల: సూర్యలంక సముద్రతీరాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. బాపట్ల సూర్యలంక తీరంలో వాచ్‌టవర్స్ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ సూర్యలంక బీచ్‌కు వచ్చే యాత్రికుల రక్షణ చర్యల్లో భాగంగా వాచ్ టవర్స్‌ను నిర్మిస్తుండటం ఎంతో సంతోషకరమైన విషయంగా పేర్కొన్నారు. సూర్యలంక తీరాన్ని ఆర్‌కే బీచ్‌లా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని తెలిపారు. దూర ప్రాంతాల నుంచి ఎక్కువ సంఖ్యలో యాత్రికులు సూర్యలంక బీచ్‌కు వస్తుంటారని, ఏదైనా ప్రాంతంలో టూరిజం అభివృద్ధి చెందాలంటే ఆ ప్రాంతంలో రక్షణ వ్యవస్థ కూడా పటిష్టంగా ఉండాలనే ఉద్దేశంతోనే పోలీసు నిఘా నేత్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు పోలీస్ వాచ్ టవర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ కొక్కిలిగడ్డ చెంచయ్య, నాయకులు వడ్డిముక్కల డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో– ఆర్టీసీ బస్సు ఢీ

ఆటో డ్రైవరు సహా రైతు మృతి



మృతిచెందిన రైతు, డ్రైవర్



నుజ్జునుజ్జయిన ఆటో

అద్దంకి: ఆర్టీసీ బస్సు, ఆటో ఎదురెదురుగా ఢీ కొట్టుకున్న ఘటనలో ఆటో డ్రైవరుతోపాటు అందులో ప్రయాణిస్తున్న రైతు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన బాపట్ల జిల్లాలోని సంతమాగులూరు మండలంలోని పాతమాగులూరు గ్రామంలో బుధవారం జరిగింది.

స్థానికులు, పోలీసులు అందించిన సమాచారం మేరకు.. ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం మల్లవరం గ్రామానికి చెందిన డి.వెంకటేశ్వరరెడ్డి, అదే గ్రామానికి చెందిన కె.వెంకటేశ్వరరెడ్డి ఆటోలో మిరపకాయలను లోడ్ చేసుకుని గుంటూరు మిర్చి యార్డుకు వెళ్లారు. అక్కడ వాటిని అమ్ముకుని, తిరిగి ఆటోలో స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో ఆటో మండలంలోని పాతమాగులూరు గ్రామ సమీపంలోకి రాగానే, గుంతకల్లుకు చెందిన ఆర్టీసీ బస్సు, ఫోర్ వీల్ ఆటో, ఎదురెదురుగా ఢీ కొట్టుకున్నాయి. ఆర్టీసీ బస్సు కింద ఆటో జొరబడి ముందు భాగం ఇంజిన్‌తో సహా నుజ్జునుజ్జయింది. దీంతో ఇద్దరూ మరణించారు. సంతమాగులూరు ఎస్సై నాగశివారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రకృతి శిక్షణలో విదేశీ స్కాలర్!

నెదర్లాండ్ దేశం నుంచి అత్తోట రాక

- సంప్రదాయ రైతులా వేషధారణ
- జీవామృతాల తయారీలో సాధన



ప్రకృతి రైతు యర్రు బాపారావుతో పొలం బడిలో..



ద్రవ జీవామృతాన్ని కలుపుతూ యోగస్

తెనాలి: తెనాలి దగ్గర్లోని అత్తోటలోగల ప్రకృతి వ్యవసాయ కేంద్రం 'భూమి భారతి'లో కొన్ని రోజులుగా విదేశీయుడు దర్శనమిస్తున్నాడు. రైతులు ధరించే ఖద్దరు షర్టు, లుంగీ, తలపాగతో పంట పొలాల్లో బిజీగా ఉంటున్నాడు. తోటి రైతులకు సాగు పనుల్లో చేదోడుగా ఉంటున్నాడు. స్థానికులకు ఇదంతా ఆశ్చర్యంగా కనిపిస్తోంది. ప్రకృతి సాగులో శిక్షణ పొందుతున్నాడని తెలిసీ ఔరా..! అనుకుంటున్నారు. అతడి పేరు యోగస్. నెదర్లాండ్స్ రాజధాని అమ్‌స్టర్‌డామ్‌కు చెందిన 24 ఏళ్ల రీసెర్చ్ స్కాలర్. నాచురల్ ఫార్మింగ్‌పై పరిశోధన చేస్తున్నారు. ఈ క్రమంలో యోగస్‌కు ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి సాగు గురించి తెలిసింది. అత్తోట గ్రామంలోని ప్రకృతి సాగు యజ్ఞం మరింత ప్రత్యేకం. ఇక్కడ ప్రైవేటు రంగంలో ప్రప్రథమంగా 'భూమి భారతి' పేరుతో ప్రకృతి వ్యవసాయ కేంద్రం ఆరంభమైంది. ఏడేళ్లుగా చేస్తున్న సాగుతో ఉత్పత్తి చేసిన 365 రకాలతో దేశీ వరి విత్తన నిధి ఏర్పాటైంది. యోగస్‌ను ఈ విశేషాలు ఆకర్షించాయి. ప్రకృతి సాగు అధ్యయనం కోసమని మూడు నెలల పర్యటనకు ఇండియాకు వచ్చాడు. ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ సూచనపై అత్తోటకు వచ్చారు. భూమి భారతి కేంద్రంలో ఉంటూ, అక్కడ ప్రకృతి సాగులో కొనసాగుతున్న యర్రు బాపారావు నేతృత్వంలో ప్రకృతి సాగులో శిక్షణ పొందుతున్నాడు.

వైవిధ్య పంటల సాగుపై ఆశ్చర్యం..

యోగస్ తండ్రి ప్రభుత్వోద్యోగి కాగా, తల్లి ప్రభుత్వ టీచరు. క్యాన్సర్ బారిన పడిన తండ్రి రెండేళ్ల క్రితం మరణించటం యోగస్ జీవితంలో పెనువిషాదం. నాచురల్ ఫార్మింగ్‌లో రీసెర్చ్ స్కాలరయిన అతడు, ప్రకృతి సాగులో ఉత్తమం ఏది? ఎక్కడ? అనేది శోధించాడు. ఫలితంగానే అత్తోట పంట పొలాల్లో ప్రత్యక్షమయ్యాడు. పది రోజులుగా ప్రకృతి సాగుతో కలిగే ప్రయోజనాలను స్వయంగా చూశారు. గోధుమలు, క్యారెట్, బంగాళదుంపలు, బీట్‌రూట్ వంటి కొన్ని రకాలే పండే తన దేశానికి భిన్నంగా ఇక్కడ వైవిధ్యమైన పంటల సాగుకు ఆశ్చర్యపోతున్నట్టు చెప్పాడు. ద్రవ, ఘన జీవామృతాల తయారీని నేర్చుకున్నాడు. ఆవు మూత్రం, పేడలోని ఔషధ విలువలను ఆకళింపు చేసుకున్నాడు. స్వదేశం వెళ్లాక రీసెర్చ్‌తో పాటు ప్రకృతి వ్యవసాయంలో ఆహార పదార్థాల ఉత్పత్తి, మార్కెటింగ్‌ను జీవితంగా చేసుకుంటానని 'సాక్షి'తో చెప్పాడు.

బయోమెడికల్ ఇంజినీర్ల బృందం పరిశీలన



జీజీహెచ్‌లో వైద్య పరికరాలను పరిశీలిస్తున్న బయోమెడికల్ ఇంజినీర్‌ల బృందం

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి కార్డియోథొరాసిక్ ఆపరేషన్ థియేటర్లోని వైద్య పరికరాలను బుధవారం బయోమెడికల్ ఇంజినీర్ల బృందం పరిశీలించింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో బయోమెడికల్ వైద్య పరికరాల నిర్వహణపై వారం రోజుల్లోగా నివేదిక అందజేయాలని బయోమెడికల్ ఎక్విప్‌మెంట్ మేనేజ్‌మెంట్ అండ్ మెయింటెనెన్స్ ప్రోగ్రామ్ (బీఈఎంఎంపీ) స్టేట్ నోడల్ ఆఫీసర్ బీవీ రావును రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్ ఆదేశించారు. ఈ మేరకు బృందం కార్డియోథొరాసిక్ ఆపరేషన్ థియేటర్‌లో పాడైన పరికరాల పునరుద్ధరణకు ప్రతిపాదనలు రూపొందించింది. వీటిలో హార్ట్, లంగ్, ఐఏబీపీ పరికరాలకు సంబంధించి విడిభాగాలను ఆసుపత్రి హెచ్‌డీఎస్ నిధుల నుంచి కొనుగోలు చేయాలని సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతికి సూచించింది. చిన్నచిన్న లోపాలున్న ఇతర వైద్య పరికరాలను బృందం అక్కడికక్కడే పునరుద్ధరించింది. వైద్య పరికరాలకు సంబంధించిన సమస్యలు పరిష్కారమయ్యే వరకు బయోమెడికల్ ఇంజినీర్ల బృందం ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో సమన్వయం చేసుకోవాలని నోడల్ ఆఫీసర్ బీవీ రావు సూచించారు. ఎన్‌హెచ్‌ఎం స్టేట్ బయోమెడికల్ ఇంజినీర్ నండూరి రమేష్, గుంటూరు జీజీహెచ్ బయోమెడికల్ ఇంజినీర్ కంచర్ల చంద్రశేఖర్, సైరెక్స్ లిమిటెడ్ బయోమెడికల్ ఇంజినీర్ల బృందం గుంటూరు జీజీహెచ్‌ను సందర్శించిన వారిలో ఉన్నారు.

ప్రాక్టికల్స్‌ను సమర్థంగా నిర్వహించాలి

- ప్రయోగశాలల్లో సీసీ కెమెరాలను కచ్చితంగా ఏర్పాటు చేయాలి
- ఇంటర్మీడియెట్ విద్య ఆర్జేడీ వీవీ సుబ్బారావు
- ఇంటర్ ప్రాక్టికల్స్ నిర్వహణపై ఉమ్మడి జిల్లాలోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో గుంటూరులో సమావేశం



మాట్లాడుతున్న ఇంటర్మీడియెట్ విద్య ఆర్జేడీ వీవీ సుబ్బారావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఇంటర్మీడియెట్ విద్య ఆర్జేడీ వీవీ సుబ్బారావు అన్నారు. ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ద్వితీయ సంవత్సర సైన్స్, ఒకేషనల్ విద్యార్థులకు ఈ నెల 26 నుంచి జరగనున్న ప్రయోగ పరీక్షల (ప్రాక్టికల్స్)పై ఉమ్మడి గుంటూరు జిల్లాలోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు బుధవారం గుంటూరులోని ఏసీ కళాశాల ఆడిటోరియంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐవో గర్నెపూడి సునీత అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్జేడీ సుబ్బారావు మాట్లాడుతూ ప్రాక్టికల్స్‌ను ప్రభుత్వ నిబంధనల మేరకు పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేసిన కళాశాలల్లో పరీక్షల నిర్వహణ ఇంటర్మీడియెట్ బోర్డు నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా జరుగుతాయని, ఈ విషయంలో కళాశాలల యాజమాన్యాల జోక్యాన్ని పరిగణనలోకి తీసుకోబోమని చెప్పారు. ల్యాబ్‌లలో సీసీ కెమెరాలను విధిగా ఏర్పాటు చేయాలని, లైవ్ స్ట్రీమింగ్ ద్వారా విద్యార్థులు, సిబ్బంది కదలికలను పరిశీలిస్తారని తెలిపారు.

పరీక్షా కేంద్రాల్లో కఠిన నిబంధనలు

ఆర్ఐవో జి.సునీత మాట్లాడుతూ ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్, థియరీ పరీక్షా కేంద్రాల్లో కఠిన నిబంధనలు అమలుపరుస్తున్నట్లు చెప్పారు. పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులందరూ ఈ నెల 15న జరగనున్న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్, 17న జరగనున్న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షలకు కచ్చితంగా హాజరు కావాలని సూచించారు. సంబంధిత రెండు పరీక్షలను ఏ కళాశాలలో విద్యార్థులకు అక్కడే నిర్వహించి, జవాబు పత్రాల మూల్యాంకనాన్ని ఇతర కళాశాలల అధ్యాపకులతో చేయించాల్సిఉందని చెప్పారు. డీఈసీ సభ్యుడు జెడ్ ఎస్ రామచంద్రరావు మాట్లాడారు. ఈ సందర్భంగా బాపట్ల డీవీఈవో ఆంజనేయులు, సీనియర్ ప్రిన్సిపాల్స్ జుబేర్, టి.శేఖర్‌బాబు, పి.యర్రయ్య నిబంధనలు గురించి వివరించారు.

గుణదల తిరునాళ్లకు సర్వం సిద్ధం





మేరీమాత ఉత్సవాలకు గుణదల పుణ్యక్షేత్రం ముస్తాబైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ తిరునాళ్లను తొలిరోజు విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి రాజారావు సమష్టి దివ్య పూజతో ప్రారంభిస్తారు. ఉత్సవాలకు లక్షలాదిగా యాత్రికులు తరలిరానున్న నేపథ్యంలో వీఎంసీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కమిషనరేట్ పరిధిలోని 1500 పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

కలెక్టర్ విజయకృష్ణన్



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

బాపట్ల: వార్డు గ్రామ సచివాలయాల ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రజలకు తీసుకెళ్లేందుకు వార్డు, గ్రామ సచివాలయ సిబ్బంది శక్తివంచన లేకుండా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ 2023 క్యాలెండర్‌ను బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఆమె ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజలకు సేవలు అందించడంలో వార్డు, గ్రామ సచివాలయ సిబ్బంది విశేషంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ బాపట్ల శాఖ అధ్యక్షులు పి.నాగేశ్వరరావు, గ్రామ, వార్డు సచివాలయం ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కోటి నాగరాజు, ఎన్జీవో అసోసియేషన్ ఉపాధ్యక్షులు పి.ప్రసాద్, జి.ఇసాక్, కార్యదర్శి బీవీబీఎస్ రాయుడు, కోశాధికారి పి.శేషగిరి, ఫెడరేషన్ కార్యదర్శి కె.సురేష్‌బాబు, సభ్యులు ఫిరోజ్, అంకమ్మరావు, రవి పాల్గొన్నారు.

21న ఉభయ రాష్ట్రాల స్థాయి ఆసు కథా రచన పోటీలు

బాపట్ల: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా స్థానిక రోటరీ కల్యాణ మండపంలో ఈనెల 21వ తేదీన ఉభయ రాష్ట్రాల స్థాయి ఆసు కథా రచన పోటీలు నిర్వహించనున్నట్లు బాపట్ల జిల్లా రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తిమ్మన శ్యామ్‌సుందర్, నందిరాజు విజయ్‌కుమార్ తెలిపారు. స్థానిక జిల్లా రచయితల సంఘం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రసరంజని, లయన్స్ క్లబ్ ఆఫ్ బాపట్ల టౌన్, రోటరీ క్లబ్ సౌజన్యంతో పోటీలు నిర్వహిస్తునట్లు తెలిపారు. పోటీలకు గంట ముందు అంశం ప్రకటిస్తామని, ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.4వేలు, మూడు వేలు, రెండు వేలు, ప్రోత్సాహక బహుమతులు ఉంటాయని తెలిపారు. ప్రతి రచయితకు ఈ-ప్రశంసాపత్రం ఇస్తారని తెలిపారు. పోటీ అనంతరం ఫలితాలు వెంటనే ప్రకటించబడటమేకాక, బహుమతులు కూడా వెంటనే ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఉదయం 8 గంటలకు రసరంజని సంస్థచే ఉచిత పుస్తక ప్రదర్శన ఏర్పాటుచేయబడుతుందని, పుస్తక ప్రియులు ఈ పుస్తకాలను ఉచితంగా పొందవచ్చన్నారు. 'జీవన నైపుణ్యాలు-జీవన ప్రగతి నిర్మాణం' అనే వ్యక్తిత్వ వికాస అంశంపై రామకృష్ణ సేవా సమితి కార్యదర్శి అమిరపు నటరాజన్‌చే ప్రత్యేక ప్రసంగం ఉంటుందన్నారు. రసరంజని సంగమేశ్వరశాస్త్రి, లయన్ ఎ.శ్రీనివాసరావు, ఎం.సుధీర్‌కుమార్, పోలాసం వీరాంజనేయులు, అన్నం పూర్ణచంద్రరావు, షేక్ బాబావలి, డాక్టర్ మేకల రాజు పాల్గొన్నారు.

బస్సును ఢీ కొన్న టిప్పర్

పెదకాకాని: ప్రయాణికులను ఎక్కించుకునేందుకు ఆగిన ఆర్టీసీ బస్సును టిప్పర్ లారీ ఢీ కొన్న సంఘటన బుధవారం వెంకటకృష్ణాపురం గ్రామ శివార్లలో చోటుచేసుకుంది. స్థానికులు, అంబులెన్స్ సిబ్బంది తెలిపిన కథనం ప్రకారం తెనాలి వయా నందివెలుగు మీదుగా ప్రయాణికులతో పల్లె వెలుగు బస్సు బయలుదేరింది. బస్సు పెదకాకాని మండలం వెంకటకృష్ణాపురం గ్రామ శివార్లకు చేరుకునే సరికి ప్రయాణికులు బస్సు ఆపారు. అదే సమయంలో వెనుక నుంచి ఇసుక లోడుతో వస్తున్న డంపర్ టిప్పర్ లారీ వేగంగా వచ్చి ఢీ కొంది. ఘటనలో బస్సులో ఉన్న పది మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో అక్కడకు చేరుకున్న రెండు 108 అంబులెన్స్ వాహనాల్లో బాధితులను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారిలో ఆరుగురు ప్రథమ చికిత్స చేయించుకుని ఇళ్లకు చేరారు. కె హనుమంతరావు, పి సాంబశివరావు, ఎస్ సుబ్బారావు, ఎన్ నాగేశ్వరి చికిత్స పొందుతున్నారు. తృటిలో ఘోర ప్రమాదం తప్పినట్లయింది. మంచు ఎక్కువగా ఉండటం, లారీ డ్రైవర్ నిర్లక్ష్యం ప్రమాదానికి కారణం.

పుస్తక ప్రియులకు పండుగ

- దక్షిణాది రాష్ట్రాల్లో అతి పెద్ద మహోత్సవం
- మూడు దశాబ్దాలకు పైగా ఆదరణ
- అంకితభావమే విజయ రహస్యం అంటున్న నిర్వాహకులు
- నేటి నుంచి పుస్తక మహోత్సవం



పుస్తక మహోత్సవ ప్రాంగణంలో ఏర్పాటు చేసి స్టాల్స్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ బుక్ ఫెస్టివల్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం నుంచి ఈనెల 19వ తేదీ వరకు పుస్తక మహోత్సవం విజయవాడ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణ వేదికగా జరుగనుంది. రాష్ట్రానికి చెందిన ప్రచురణ కర్తలే కాకుండా దేశ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ ప్రచురణ సంస్థలు, ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు, బహుళ జాతి సంస్థలు సైతం ఈ పుస్తక మహోత్సవంలో తమ స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నాయి. సాహిత్య అకాడమీ, నేషనల్ బుక్ ట్రస్ట్ తదితర ప్రభుత్వ సంస్థలు సైతం బుక్ ఫెస్టివల్‌కు అండదండలందించి పుస్తక పఠనాన్ని పెంపొందిస్తున్నాయి. దక్షిణాది రాష్ట్రాల్లో అత్యంత పెద్దదిగా పేరు గాంచిన విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ 32 సంవత్సరాల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుని 33వ సంవత్సరంలోకి అడుగు పెట్టనుంది.

220 స్టాల్స్ ఏర్పాటు

1989వ సంవత్సరంలో నగరానికి చెందిన ప్రచురణ కర్తలు నేషనల్ బుక్ ట్రస్ట్ సహకారంతో తొలి సారిగా 89 స్టాల్స్‌తో ప్రారంభించిన పుస్తక మహోత్సవం 370 దుకాణాలను సైతం నిర్వహించింది. అయితే పార్కింగ్‌కు, ఇతర సదుపాయాలకు స్థలాన్ని కేటాయించడంతో గతంలో దానిని 300 స్టాల్స్‌కు మాత్రమే పరిమితం చేశారు. ఈ ఏడాది బుక్ ఫెస్టివల్ ప్రాంగణాన్ని మార్పు చేయడంతో 220 స్టాల్స్‌కు పరిమితమైంది.

సాంకేతికత ఉన్నా.. తగ్గని ఆదరణ

విజయవాడ పుస్తక మహోత్సవం కోసం సాహితీ ప్రియులు ఎదురు చూస్తున్నారు. ప్రతి ఏడాది జనవరి 1వ తేదీన ప్రారంభమయ్యే మహోత్సవం కొన్ని కారణాల రీత్యా ఫిబ్రవరి 9వ తేదీన ప్రారంభమవుతోంది. కృష్ణాజిల్లానే కాకుండా యావత్ కోస్తా జిల్లాలకు చెందిన విద్యార్థులు, సాహితీ వేత్తలు, సాహితీప్రియులు, విద్యాసంస్థలు పుస్తక మహోత్సవానికి విచ్చేసి కొనుగోలు చేస్తుంటారు. ఇంటర్నెట్ వంటి ఆధునిక సాంకేతిక ప్రచార మాధ్యమాలు అభివృద్ధి చెందుతున్నా పుస్తక పఠనానికి ఏమాత్రం ఆదరణ తగ్గలేదన్న విషయం గత పుస్తక మహోత్సవాల విజయవంతం రుజువు చేశాయి.

ఆలోచింపజేసే చర్చా వేదికలు..

గడిచిన కొన్నేళ్లుగా పుస్తక మహోత్సవంలో కొత్త అంకానికి తెర తీశారు. గతంలో పుస్తకాలు, సాహితీ కార్యక్రమాలు దాని అనుబంధ అంశాలకే బుక్ ఫెస్టివల్ సొసైటీ పరిమితమైంది. కానీ ఇటీవల ప్రత్యేక అంశాలపై చర్చా కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆలోచింపజేస్తున్నారు. గతంలో నోట్ల రద్దు గురించి దువ్వూరి సుబ్బారావు, నదుల అనుసంధానం గురించి రాజేంద్రసింగ్ వంటి ప్రముఖులతో ప్రత్యేక చర్చా కార్యక్రమాలను నిర్వహించారు. అదే రీతిలో ప్రతి ఏడాది కొన్ని ప్రత్యేక అంశాలపై సదస్సులను ఏర్పాటు చేసి చక్కని చర్చను కొనసాగిస్తున్నారు.

కోల్‌కతా బుక్ ఫెస్టివల్‌ను చూసి...



కోల్‌కతా బుక్ ఫెస్టివల్‌ను, ఇతర రాష్ట్ర రాజధానుల్లో పుస్తక మహోత్సవాలను చూసి విజయవాడలో కూడా నిర్వహించాలని భావించాం. తొలి రోజుల్లో అనేక వ్యయప్రయాసల కోర్చి నేషనల్ బుక్ ట్రస్ట్ సహకారంతో తొలిసారిగా విజయవాడలో పుస్తక మహోత్సవాన్ని నిర్వహించాం. ఆ తరువాత సభ్యులందరి కృషితో సొసైటీ అన్ని అవాంతరాలను ఎదుర్కొంటూ 32 సంవత్సరాల ప్రస్థానాన్ని పూర్తి చేసుకోవడం ఆనందంగా ఉంది.

– బెల్లపు బాబ్జీ, బుక్ ఫెస్టివల్ సొసైటీ గౌరవాధ్యక్షుడు

విజయవంతంగా పుస్తక మహోత్సవం



నూతన సాంకేతిక విప్లవం నేపథ్యంలో పుస్తక పఠనానికి ఇబ్బందులెదురవుతున్నాయి అనుకుంటున్న ప్రస్తుత అసాధారణ పరిస్థితుల్లోనూ విజయవాడ పుస్తక మహోత్సవం విజయవంతంగా జరుగుతోంది. ముఖ్యంగా కోల్‌కతా వంటి మహా నగరాల్లో మాత్రమే ఈ విధమైన పుస్తక మహోత్సవం విజయవంతమవుతుందని పుస్తక ప్రచురణ సంస్థలు భావించేవి. కానీ విజయవాడ వంటి నగరంలోనూ విజయవంతం చేసి చూపించిన ఘనత ఈ ప్రాంత ప్రజానీకానికి దక్కుతుంది.

– డి.విజయకుమార్, ఎమెస్కో అధినేత

మీడియా సహకారం అద్భుతం



విజయవాడ పుస్తక మహోత్సవం విజయవంతంలో మీడియా ప్రధాన భూమికను పోషిస్తోంది. విజయవాడ పుస్తక మహోత్సవంలో నగరంలోని మీడియా సంస్థలన్నీ భాగస్వాములుగా మారి తమ సొంత కార్యక్రమంగా కలిసి ప్రయాణం చేస్తాయి. పుస్తక మహోత్సవ ప్రాంగణం పుస్తక ప్రియులతో కళకళలాడటం చూస్తుంటే అదొక అద్భుతమైన అనుభూతికి అందరం లోనవుతుంటాం.

– కె.లక్ష్మయ్య, బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యదర్శి

అందరి అండతోనే



నగరంలోని పుస్తక ప్రచురణకర్తలందరి సహకారంతోనే ఇన్నేళ్లుగా పుస్తక మహోత్సవాన్ని కొనసాగిస్తున్నాము. పుస్తక ప్రచురణకర్తలే కాకుండా సాహితీవేత్తలు, ఇతర కళా సంస్థల నిర్వాహకులు, సాహితీ అభిమానులు, నగర ప్రముఖులు ఇలా ప్రతి ఒక్కరూ పుస్తక మహోత్సవం విజయవంతానికి అండగా నిలిచారు. ప్రభుత్వ శాఖలు సైతం ఈ ఏడాది అపూర్వమైన సహకారాన్ని అందిస్తున్నాయి.

– మనోహరనాయుడు, బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు

మహిళపై చీటింగ్ కేసు నమోదు

మార్టూరు: నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి తనకు ఏ మాత్రం సంబంధం లేని వ్యక్తులకు చెందిన భూమిని ఇతరులకు విక్రయించిన మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కమలాకర్ బుధవారం సాయంత్రం తెలిపారు. గుంటూరులో నివాసముంటున్న బోడా సుబ్బరావమ్మ స్థానిక విజయలక్ష్మి కల్యాణ మండపం వెనుక 20 సెంట్లు భూమిని 1982లో కొనుగోలు చేసింది. ఆమె భర్త బోడా భాస్కరరావు 2020లో మరణించారు. ఆమెకు నలుగురు కుమారులున్నారు. చిలకలూరిపేటకు చెందిన చింతల చెరువు సామ్రాజ్యం సదరు ఆస్తి యజమానులైన బోడా సుబ్బరావమ్మ, ఆమె భర్త భాస్కరరావులు తన తల్లిదండ్రులని వారికి తాను ఏకైక సంతానం అని తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించింది. భాస్కరరావు 2020లో మరణించగా 2008లోనే ఆయన చనిపోయినట్లు ఒంగోలు మున్సిపాలిటీలో మరణధ్రువీకరణ పత్రం తెచ్చింది. సుబ్బరావమ్మ ఇప్పటికీ జీవించే ఉండగా 2017లో మరణించినట్లు చిత్తూరు జిల్లా నగరి నుంచి సుబ్బరావమ్మ డెత్ సర్టిఫికెట్ సృష్టించింది. ఈ రెండు పత్రాలతో స్థానిక డాక్యుమెంట్ రైటర్ ద్వారా గత నెల 10వ తేదీ విజయవాడకు చెందిన ఎర్రమనేని పూర్ణ చంద్రరావుకి సామ్రాజ్యం ఆ స్థలం విక్రయించింది. సుమారు రూ. 50 లక్షల విలువైన తమ భూమి తప్పుడు ధ్రువపత్రాలతో అన్యాక్రాంతం అయిన విషయం తెలుసుకున్న సుబ్బరావమ్మ కుమారుడు బోడా వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుపై సామ్రాజ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కమలాకర్ తెలిపారు.

గంజాయి అక్రమ రవాణా కట్టడి

- గుంటూరు రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించిన రైల్వే పోలీసులు
- రైల్వే ఎస్పీ విశాల్‌గున్ని ఆదేశాల మేరకు తనిఖీలు



ప్రయాణికుల వస్తువులను తనిఖీ చేస్తున్న జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు

లక్ష్మీపురం(గుంటూరువెస్ట్): గుంటూరు రైల్వేస్టేషన్‌లో అక్రమంగా గంజాయి తరలిస్తున్నారన్న సమాచారం మేరకు రైల్వే ఎస్పీ విశాల్‌గున్ని ఆదేశాల మేరకు గుంటూరు రైల్వేస్టేషన్‌లో పలు రైళ్లలో ప్రయాణికుల సామాగ్రి, పార్సిల్ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించినట్లు జీఆర్పీ సీఐ డి.వెంకటేశ్వర్లు తెలిపారు. గుంటూరు రైల్వేస్టేషన్‌లో బుధవారం రైల్వే ఎస్పీ విశాల్‌గున్ని ఆదేశాల మేరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గుంటూరు రైల్వే స్టేషన్‌కు గుర్తుతెలియని వ్యక్తులు గంజాయి రవాణా చేస్తున్నట్లు ఎస్పీ ఆదేశాల మేరకు జీఆర్పీ, ఆర్పీఎఫ్, సీఐబీ, డాగ్‌స్క్వాడ్ సంయుక్తంగా తనిఖీలు చేయడం జరిగిందన్నారు. ప్రయాణికుల వస్తువు సామగ్రి, పార్సిల్ కార్యాలయాన్ని, జన్మభూమి, భువనేశ్వర్ వంటి పలు రైళ్లలో క్షుణ్ణంగా పరిశీలించడం జరిగిందన్నారు. రైళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు భోగీల్లో గుర్తుతెలియని వ్యక్తులు సామగ్రి, పార్సిల్ కార్యాలయాల్లో సామగ్రి ఉంచి అనుమానాస్పదంగా ఉంటే తక్షణమే తమకు సమాచారం తెలియజేయాలన్నారు. అనుమానాస్పదంగా ఉన్నట్లు తెలిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. రైళ్లల్లో ప్రయాణించే ప్రయాణికులు తోటి ప్రయాణికుల నుంచి తినుబండారాలు, పానీయాలు సేవించడం ప్రమాదకరమన్నారు. గుంటూరు రైల్వేస్టేషన్‌లో నిర్వహించిన తనిఖీల్లో ఎలాంటి అక్రమ గంజాయి రవాణా కనబడలేదని తెలిపారు. అనంతరం ప్రయాణికులకు గుర్తుతెలియని వ్యక్తులను గుర్తించిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పోలీసులకు తెలియజేయాల్సిన వాటిపై అవగాహన కల్పించారు.

బెట్టగాన్ -2023 పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ గవర్నింగ్ బాడీ సభ్యులు

బాపట్లఅర్బన్: బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో ఎంతో ప్రతిష్టాత్మకంగా మార్చి 3, 4 తేదీల్లో జరిగే బెట్టగాన్-2023 పోస్టర్‌ను బుధవారం బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ గవర్నింగ్ బాడీ సభ్యులు ఆవిష్కరించారు. కన్వీనర్ ప్రొఫెసర్ డి.నిరంజన్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నిర్వహించే టెక్నికల్, కల్చరల్, లిటరరీ స్పోర్ట్స్, ఈవెంట్స్‌కు సంబంధించిన వివిధ పోటీలను నిర్వహించి మార్చి 4వ తేదీన విజేతలకు జ్ఞాపికలను, సర్టిఫికెట్స్‌తోపాటు రూ.మూడు లక్షలకు పైగా నగదు బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. సంగీత విభావరి కార్యక్రమం ఉంటుందన్నారు. ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను, శక్తిని వెలికి తీసి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలన్నారు. సెక్రటరీ మానం నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు దోహదపడే ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడంలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ఎప్పుడూ ముందుంటుందన్నారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్.నజీర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించేందుకు చక్కటి వేదిక బెట్టగాన్-2023 నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ ప్రెసిడెంట్ రామోహన్‌రావు, గెల్లి దిలీప్‌కుమార్, జాయింట్ సెక్రెటరీ కొమ్మినేని హరిపద్మప్రసాద్, కోశాధికారి తాళ్లూరి రామకృష్ణ, కో-కన్వీనర్ డాక్టర్ బి.రత్న సునీల్, ఎ.రామోహన్‌రావు, షేక్.శబరినా సుల్తాన్, వై.అంకమ్మచౌదరి, అధ్యాపక బృందం, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వాడరేవులో పునీత్ సాగర్ అభయాన్



వాడరేవు తీరాన్ని శుభ్రం చేసేందుకు వచ్చిన ఎన్‌సీసీ క్యాడెట్లు

చీరాల టౌన్: పర్యాటకరంగంగా వృద్ధి చెందుతున్న వాడరేవు సముద్ర తీర ప్రాంత పరిశుభ్రతను సామాజిక బాధ్యతగా తీసుకుంటే సముద్ర తీర ప్రాంతం సుందరంగా ఉంటుందని 23 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సునీల్ గౌతమ్ అన్నారు. బుధవారం వాడరేవులో పునీత్ సాగర్ అభయాన్ కార్యక్రమంలో భాగంగా 23 ఆంధ్రా బెటాలియన్‌లోని వీఆర్‌ఎస్ అండ్ వైఆర్‌ఎన్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు, ఎన్‌సీసీ సిబ్బంది సముద్ర తీరాన్ని శుభ్రం చేశారు. ఎన్‌సీసీ క్యాడెట్లు తీరం ఒడ్డున ఉన్న వ్యర్థాలు, ప్లాస్టిక్ సీసాలు, ఇతర చెత్త చెదారాలను తొలగించి శుభ్రం చేశారు. కళాశాల ఎన్‌సీసీ అధికారి ఎం.రాజేష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన పునీత్ సాగర్ అభయాన్ కార్యక్రమంలో కమాండింగ్ ఆఫీసర్ మాట్లాడారు. వాడరేవు సముద్ర తీర ప్రాంతం పర్యాటకంగా వృద్ధి చెందుతుందని వాడరేవు, రామాపురం సముద్ర తీర ప్రాంతాలకు ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు చెందిన పర్యాటకులతో పాటు సినిమా షూటింగ్‌లు చేస్తున్నారన్నారు. పర్యాటకంగా వృద్ధి చెందే తీర ప్రాంతం అపరిశుభ్రంగా ఉండటం వలన సీజనల్ వ్యాధులు ప్రబలుతాయన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎన్‌సీసీ క్యాడెట్లు చేస్తున్న సేవలను ప్రశంశించారు. బెటాలియన్ ట్రైనింగ్ ఆఫీసర్ లక్ష్మణ్ నేగి, హవల్దార్ వైఖుంఠరావు, భరత్, హరీష్, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

ఐక్యతతోనే సర్పంచుల సమస్యలకు పరిష్కారం

సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు



జిల్లా అధ్యక్షుడు మనోహర్‌ను సత్కరించిన పాపారావు, వీరాంజనేయులు తదితరులు

పాతగుంటూరు: జిల్లాలోని గ్రామ పంచాయతీ సర్పంచులు ఐకమత్యంగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలని సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిలకలపూడి పాపారావు అన్నారు. బుధవారం బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞానకేంద్రంలో గుంటూరు జిల్లా సర్పంచుల సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. సభకు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆరుదల సాంబశివరావు అధ్యక్షత వహించారు. పాపారావు మాట్లాడుతూ ప్రస్తుతం సర్పంచులకు అందిస్తున్న గౌరవవేతనం రూ.3 వేలను రూ.15 వేలు చేయాలని కోరారు. రాష్ట్ర పంచాయతీ పరిషత్ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇవ్వాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులను 2022-23 తొలి విడత రూ.1005 కోట్లను తక్షణమే విడుదల చేయాలని కేంద్రాన్ని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ అల్లా బక్షు, వి.అప్పిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి టి.కృష్ణమోహన్, సభ్యులు చందు వెంకటసాంబశివరావు, తోకల సరోజినీ, అక్కల శ్రీనివాస్‌రెడ్డి, పి.నాగమణి, ఎస్.లలితకుమార్, దాది వెంకటలక్ష్మి, కర్నాటి శ్రీనివాసరావు, మైనేని వెంకటేశ్వరరావు, బ్రహ్మారెడ్డి, నలివెల ఉషారాణి, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

జిల్లా కార్యవర్గం ఎన్నిక

గుంటూరు జిల్లా సర్పంచుల సంక్షేమ సంఘం నూతన అధ్యక్షులుగా ముప్పాళ్ల మనోహర్ (బండారుపల్లి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా మేడా బాబు, కొర్రపాటి అశోక్‌కుమార్, డాక్టర్ చొప్పర ప్రీతి, డి. సూర్యప్రకాష్‌రావు, కమ్మ నాగమల్లేశ్వరరావు, ఆవుల సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా ఆరుదల సాంబశివరావు, తోకల సరోజిని నరసింహారావు, బీరం జానకీదేవి, కాకి రమాదేవి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా షేక్.అబిదా అలి, కొరివి చిన్న, ఆరుదల సాంబశివరావు, కార్యదర్శులుగా మేదరమెట్ల శివశంకర్, మబ్బు శిరీష సుధాకర్, కోశాధికారిగా మామిడి స్వాతి సాయి ఎన్నికయ్యారు.